

# బయానా

**- ఐతా చంద్రయ్య**

జరీ అంచు కండువాను సర్దుకుంటూ సుడిగాలిలా షెడ్డులోకొచ్చాడు యాదగిరి. బతుకనేర్చిన వాడని ఊళ్ళో పేరుందతనికి. "ఈసారి గూడా వానదేవుని దయలేక పాయె. ఏంజేసి బతుకతవోయ్ నారాయణా?" మాటల్లోకి దిగాడు.

నారాయణ కిమ్మనలేదు. కుడి పిడికిలి గదవకానించి ఎడమ అరచెయ్యి నేలకానించి కమ్మరి కొలిమి పక్కన మౌన తపస్విలా కూచున్నాడు.

మూడు మూరల పొద్దెక్కింది. పైరవీ ఆసరాతో పార్టీ పదవి సంపాదించిన రౌడీలా ఎండ చిటపటలాడ్తోంది. పేరు పెరుమాళ్లది - ఆరగింపు అయ్యవారిదన్నట్టు పేరుకు మాత్రం వానాకాలమది ప్రతాపమంతా ఎండదే.

తోలు తిత్తిబండ మీద తీరిగ్గా కూలబడ్డాడు యాదగిరి. ఆదరణ పథకం కింద ప్రభుత్వం నారాయణ కందించిన సుత్తి, చిమ్మట, పట్టకారు... ఇంకేవేవో పనిముట్లు ఓ పక్కన కుప్పగా పడున్నై.

"నీయవ్వ! పనివ్వలేదు గాని పనిముట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నరు గదా!" ఎలాగైనా నారాయణను మాట్లాడించాలను కున్నాడు యాదగిరి. నారాయణ చూపులు షెడ్డు పైకప్పుకు తచ్చాడుతున్నై.

రామరాజ్యంల నెలకు మూడు వానలు వడ్డయట. మరి ఆ శ్రీరాముని పేరుమీ దున్న ఈ రాఘవాపురం గ్రామంల ఎన్నో ఏండ్లనుంచి పెద్ద వానల్లేవు. కండ్లల్ల తప్ప బావులల్ల, చెరువులల్ల నీళ్లలేవు. రోజూ కొద్దిసేపన్నా కొలిమిదగ్గర కూచోకపోతే మనసు బట్టదు... ఆరాటం...

"ఏయ్ నారాయణా! తపస్సు జేస్తున్నా వోయ్!" గొంతు ఖంగుమంది. నారాయణ ఆవులించాడు.

"ఆహ!... యాద్గిరి బావానా! గడ్డపార మొనలెట్టా లెనా?" కావాలనే అడిగాడు.

> దండి ఎండల పుణ్యమాని భూమిలో నీళ్లు అడుగంటుతున్నై. జమీందార్లు మాత్రమే లోతుబోరువులు తవ్వించి కరెంటు మోటర్లు పెట్టుకుంటున్నరు. నాలాంటోళ్లు పట్నంలనే బియ్యం కొనుక్కుంటున్నరు.

"హయ్యో రామ!" కండువాను మోకాళ్లకు, నడుముకు ముడేసుకు న్నాడు "మొగతనం లేనోనికి ముగ్గురు పెండ్లాలన్నట్టు జానెడు భూమిలేనోన్ని... గట్లడు గుతే ఎట్లనోయ్!"

"ఏదో గమ్మత్‌కన్న బావా!" చిన్నగా నవ్వి పెద్దగా నిట్టూర్చాడు నారాయణ.

కులమతాల కతీతంగా వరుసలతో పిలుచుకోవడం పల్లె ప్రజల కలవాటు.

"అఁఆఁ... మన బతుకులే గమ్మత్‌గున్నైగానీ నిన్న సిద్దిపేటకు పొయ్యొచ్చిన్నోయ్."

'అదో ముచ్చటనా?" నారాయణ పెదాలమీద బయటి నుంచి చొచ్చుకొచ్చిన సూర్యకిరణాలు పరావర్తనం చెందినై.

"సిద్దిపేట పట్నమైతేంది? మనూరికి పది కిలోమీటర్లేనాయె. అటోల అటువొయ్యి ఇటు రావచ్చు. మనూరి వైపు పోరలు గెడ్డాలు గూడా సిద్దిపెట్లనే చేయించుకుంటుండ్రు. నీ అసొంటి వ్యాపారస్తులు రోజుకు రెండుమూడుసార్లు పొయ్యొస్తున్నరు గదా!"

"సర్సరే... చెప్పేది వినవోయ్ మొగుడా!"

"ఆఁ... చెప్పు బావా. నాకైతే పనీపాటల్లేవు" సర్దుక్కూచున్నాడు. యాదగిరి ఊపిరి పీల్చు కున్నాడు.

"సిద్దిపేట్ల మన మార్వాడి మురళిసేటు కలిసిండు. నీ పొలాన్ని ఎంతకమ్ముతవో అడుగు మన్నడోయ్."

లెంపకాయ అంటించినట్టనిపించింది... అయినా పరిస్థితి...

"ఓహో! మురళీ సేటా!" తమాయించుకున్నాడు." ఆయనకెందుకటా! మొన్న మన వెంకటేశంతోని అదే మాటన్నడటా!"

"నీ పొలం పక్క పొలం... మూడెకరాలు వెంకటేశం దగ్గర ఇంతకుముందే కొనేసిండు గదా. అదీ ఇది కలిపి పెద్ద కోళ్లఫాం వేస్తాడట."

"గట్లనా! పట్నాలు పల్లెల్ని మింగేస్తున్నయంటే ఏమిటో అనుకున్నా బావా!" నారాయణకేదో అర్థ మైంది. అది యాదగిరి అవగాహన కందింది.

"ఆ రోజులల్ల హంగామా వానలాయె. ధాన్యలక్ష్మి మనూరి పొలాలల్ల డాన్స్ చేస్తుండె." యాదగిరి శక్తి యుక్తి మాటల్లోకి దిగింది. "నీ అసొంటి చేతి వృత్తు లోల్లకు చేతినిండా పనులాయె. అటు వ్యవసాయం, ఇటు కమ్మరి పని... నీకైతే తీరికనే లేకపాయె. గట్ల సంపాదించినవు కాబట్టే కూతురు పెండ్లి సునాయా సంగ చేసినవు. మిరిప్పుడో...?"

"ఇప్పుడేముంది బావా! ఏడాదికెనిమిది నెలల ఎండాకాలమాయె. పొలాలు ఎండ భరించలేక నోర్లు దెరిచె". నారాయణ ఎదసొద బయట పడుతోంది. "ఏటేటా ఎదిరి చూపులేనాయె. పెద్ద వానలు పత్తాలేకపాయె. తాగేతందు గ్గూడా నీళ్ల కరువాయె. పెద్ద జమీందార్లకు ట్రాక్టరుండె. నాగండ్లు, గడ్డపారలు మూలకువడె. నా అసొంటోనికి పనె క్కడుంటదీ, పొట్ట ఎట్లా గడుస్తదీ?"

"నారాయణ పొలాన్ని బేరం కుదిర్చిపెడితే నువ్వడిగి నంత కమీషనిస్తా"నన్న మురళీధర్ సేటు తియ్యని వాగ్దానం యాదగిరి మెదడు పొరల్లో కమ్మగా కదిలింది.

"గండుకేనోయ్!" ఉత్సాహం రెట్టింపైంది. "అక్కరకు రాని చుట్టము... పద్యం గుర్తుకుందిగదా! గట్లనే పనికిరాని పొలాన్ని పట్టుకుని ఎన్నేండ్లు యాల్లాడుతవ్...?"

నిజమే... ఇంకెన్ని రోజులు? నారాయణ మనసు మైదానములో దుమారం చెలరేగింది.

* * *

దండి ఎండల పుణ్యమాని భూమిలో నీళ్లు అడుగంటుతున్నై. జమీందార్లు మాత్రమే లోతుబోరువులు తవ్వించి కరెంటు మోటర్లు పెట్టుకుంటున్నరు. నాలాంటోళ్లు పట్నంలనే బియ్యం కొనుక్కుంటున్నరు. గడ్డిలేక... అల్‌కబీరు ఫ్యాక్టరీకి కోతకు పోతున్న పశువుల అంబా, అంబా అరుపులు వింటూంటే కడుపు చెరువై పోవట్టె. నా ఎడ్లనుగూడా అమ్మక తప్పకపాయె. రాజారాం బిఇడి సీటుకోసం వేరే దారిలేకపాయె... నారాయణ మనోగతం మల్లగుల్లాలు...

"ఏమయ్యోయ్!" అర్ధాంగి అన్నపూర్ణ గాజులు గల్లు గల్లుమన్నైం." ఇంగో ఉత్తరమొచ్చింది. మన రాజారాం రాసినట్టుంది. కొడుకు కోడల్తోని వారంకిందనే ఊరికివో యెగదా. "ఉత్తరమందించబోయి భర్త వాలకానికి బిత్తరవో యింది. "గిక్కడ గిట్ల బీరపువ్వోలె బీరపోయి కూచున్న వేందీ?" ముక్కుమీద వేలేసుకుంది.

నిరుద్యోగ యువత ఆకలి కేకల్ని ఆలకించని కాలంలో డియస్సీ పుణ్యమాని కొడుకు రాజారాంకు టీచరుద్యోగం దొరికింది. రెండేళ్ల కన్సాలిడేటెడ్ జీతం తర్వాత ఈమధ్యనే స్కేలు దొరికింది. అందుకే పట్టుబట్టి భార్యను తీసుకె ళ్లాడు. రెక్కలొచ్చిన పక్షులు ఎగిరిపోక తప్పదు...

నారాయణ చూపులు భార్యవైపు మళ్లినై. కళ్లమీదికొచ్చిన సూర్యకిరణాలను అర చెయ్యితో అడ్డుకుని మరో చెయ్యి చాచాడు. "నారాయణఖేడంటే నూరు కిలోమీటర్లు దాటాలె. శోభ ఉట్టిమనిషి కాదాయె." గొణుక్కుంటూ ఇన్‌లాండ్ లెటరందుకున్నాడు.

"అమ్మానాన్నలకు నమస్కారం. శోభకు మొన్నరాత్రి కడుపునొప్పి ఎక్కువైంది. నిన్న నర్సింగ్‌హోంల చేర్పించిన. పిండం కడుపుల చచ్చిపోయిందట. పెద్దాపరేషన్ చేసి తీసేసిండ్రు. దవాఖాన ఖర్చులు ఐదువేలు దాటినై. దోస్తు సాయంతోని అప్పుజేసిన. నాకు భయమైతుంది. మీరిద్దరు వెంటనే రావాలె. మనందరం కలిసి కారుదీసుకుని పోదాం..." పైకి చదివేశాడు.

నారాయణ నవనాడుల్లో రక్తం స్తంభించింది.

"అయ్యో బిడ్డా!" అన్నపూర్ణ గుండె గొంతులోకొచ్చింది. తన్నుకొస్తున్న దుఃఖం శోకంగా మారింది. గుండెలు బాదుకుంది. "ఎంత పనైందిరా దేవుడా. నా కొంప ముంచినవురా దేవుడా..." నోటికి కొంగు అడ్డంపెట్టుకుని ఏడుస్తోంది.

కోడలు నెలదప్పిందనంగానే అన్నపూర్ణకు ఏనుగెక్కినట్టుండె. నెలలు నిండుతున్న పిల్లను గంతదూరం తీస్కపోవద్దురా అంటే వాడు వినకపాయె... నారాయణ గుండె బరువెక్కుతోంది. తాను బాధపడితే అన్నపూర్ణ ఆగమైపోతుంది. చేతులు కాలినంక ఆకులు పట్టుకుంటే ఏం లాభం?

"గట్ల ఏడుస్తే ఏమొస్తుంది పూర్ణా?" భుజాలు పట్టి కుదిపాడు. "దక్కని పిల్ల దుఃఖం బెట్టింది. పుట్టక ముందే గిట్టింది."

శోకం వెక్కిళ్లుగా మారింది. "కోడలు సీమంతం గూడా చేస్తిమి. మనింట పసిపిల్ల అంబాడుతుందనుకుంటిమి. కొడుకు వినకపాయె. కోడలు ఏమనకపాయె."

"అదంతా మర్చిపోతావె. వాళ్లేమన్నా ముసలోళ్లా? ముడిగోళ్లా? వాడెంత పరేషానైపోతున్నడో..."

ఎండ బలం పుంజుకుంటోంది.

"కొడుకూ కోడల్ను చూడాలెనయ!" దీనంగా అడిగింది.

"నిజమే కానీ... అప్పుజెయ్యాలె. చేస్తే ఎట్లా తీర్చాలె? అప్పుల పాలైన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నరు. అప్పిచ్చినోళ్లు ఆగమైపోతున్నరు." ఆవేదన అతలాకుతలం చేస్తుంటే గదవకు చేతులానించి కూచున్నాడు.

అప్పుడే... కండువా దులుపుకుంటూ గబగబా లోపలికొస్తున్న యాదగిరి కాళ్లకు బ్రేకులు పడినై. "అగో... ఏందోయ్...ఏంది చెల్లెమ్మా..." ఇద్దర్నీ మార్చి మార్చి చూస్తూ "గట్లా కూచున్నరేంది? ఏమైందో?" దగ్గరికొచ్చి కూచున్నాడు.

ఉత్తరం లాక్కుని చదివేశాడు. మబ్బులు తొలగిన ఆకాశంలా మొహం ఏకవర్ణమైంది. "అరేరే... మా అల్లుడు ఎంత పరేశానైపోతున్నడో. సర్కారు నౌకరని సంతోషమాయె కాని... గిదొక్కటి వచ్చిపడె... ప్చ్... గా దేవుడు మనుషులకేదో పరీక్ష పెడ్తుంటడు." ఉత్తరాన్ని నేలకేసి కొట్టాడు. సానుభూతి కెరటాలు సమయానుకూలంగా పొంగుకొస్తున్నై.

"మేమే జన్మల ఏం పాపం జేసినమో గాని పదేండ్ల నుంచి పరేశాన్ల మీద పరేశాన్లు." అన్నపూర్ణ ఆపుకోలేకపోయింది. "పిల్లగానికి, నౌకరి దొరికింది. ఎవల బిశ్వాత్ ఏందనుకుంటే గిసొంటి తిప్పలు రావప్పా..." బాధ వెళ్లబోసుకుంది.

యాదగిరి- నారాయణ బాల్య స్నేహితులు. క్లాసులో ఒకే బెంచిమీద కూచుండేవారు. కలిసి ఆడుకునేవారు. వ్యాపార చదరంగములో ఎప్పుడెలా ఎత్తువెయ్యాలనేది యాదగిరికి బాగా ఒంటబట్టింది.

"ఇప్పుడే మీరు నారాయణఖేడుకు పొయ్యి వాళ్లను తోలుక రాండ్రి." సలహా. "పైసల గురించి పరేశాన్ కావద్దు. ఇగో ఈ వెయ్యి రూపాయలు దీస్కోండ్రి..." పది వంద నోట్లు నారాయణ జేబులో కుక్కేశాడు. "లెక్కలు వచ్చినంక చూస్కుందాం."

రెండు జతల కళ్లు నిండు కృతజ్ఞతా భావంతో యాదగిరిని తడిమాయి.

* * *

సంసార సాగరములోని ఆటుపోట్లను నిరసిస్తూ- బస్సులోవెళ్లి కొడుకూ- కోడల్ని కారులో తీసుకొచ్చేసరికి ఖర్చులు తడిసిమోపెడైనై. కారు కిరాయి, డ్రైవరు బత్తా, నర్సింగ్‌హోం బిల్ బాలెన్సు... చాలానే అయింది. అప్పుకోసం రాజారాం వాళ్లింటి ఒనర్ను బతిమాలుతుంటే నారాయణ పంచప్రాణాలు గిలగిలలాడినై.



"ఇప్పుడు అప్పోసొప్పో చేసి కొడుక్కోసం చేసిన అప్పుదీర్చాలెగదా. కొత్త అప్పుకు మల్లా మిత్తిగట్టాలె. సర్కారు నౌకరంటే గొర్రెతోక జీతం. గిసొంటి పెద్ద ఖర్చువొస్తే పరేశానైపోవాలె. గాభూమి పడావ్ పడుంది. ఎడ్లుగూడా లేకపాయె. బాగా ఆలోచించుకో."

"వచ్చే ఫస్టునుండి నెలకో వెయ్యి అసలు, వడ్డీ... తీర్చేస్తా"నని కొడుకు నోరు విడిచి అడుగుతూంటే అన్నపూర్ణ కడుపులో చల్లజేసి నట్లైంది.

లోకంపోకడ నాకలింపు చేసుకోవడంలో కాకలుదీరిన యాదగిరి సతీసమేతంగా వచ్చి పరామర్శించి, ధైర్యం జెప్పి వెళ్లిపోయాడు. వెళ్లేముందు, రేపు సిద్దిపేటనుండి మురళీధర్ సేటు నీ దగ్గరికొస్తుండు. నువ్వే మాట్లాడు..." చెప్పేశాడు.

"అది కాదు బావా! మొగపిల్లగాడున్నడు. జెరంత పొలమున్నదంటే ధైర్యంగదా" నారాయణ ఆరాటం వాదించబోయింది.

"నువ్వేమో అప్పంటే అదిరిపోతవు. ఇజ్జద్దారుకు గట్లనే ఉంటదనుకో." మంచి మాటలతో నచ్చజెప్పాడు.

"ఇప్పుడు అప్పోసొప్పో చేసి కొడుక్కోసం చేసిన అప్పుదీర్చాలెగదా. కొత్త అప్పుకు మల్లా మిత్తిగట్టాలె. సర్కారు నౌకరంటే గొర్రెతోక జీతం. గిసొంటి పెద్ద ఖర్చువొస్తే పరేశానైపోవాలె. గాభూమి పడావ్ పడుంది. ఎడ్లుగూడా లేకపాయె. బాగా ఆలోచించుకో."

రాజారాం అంతా విన్నాడు. బుర్రలో భూగోళం తిరుగుతోంది. నారాయణకైతే ఎండాకాలం ఎడారిలో దారి దప్పి నడుస్తున్నట్టుంది. రాత్రి భోజనాలయాక.

"యాదగిరి మామ జెప్పింది విన్నావుగదా బిడ్డా! చెప్పు ఏం జేద్దాం" కొడుకుముందు ప్రస్తావించాడు. శోభారాణి అన్నపూర్ణ పక్కన కూచుంది.

రాజారాం బిత్తరచూపులు. అన్నపూర్ణ అందుకుంది- "వాన్నేం జెయ్‌మంటవయా! ఇన్ని రోజులు పొకమీద పక్కులెక్క సుఖాంగున్నడు, కష్టమంటే ఏందో గిప్పుడే తెల్వవట్టే."

"గట్లంటే ఎట్లా?" నారాయణకామాట రుచించలేదు. "పనెత్తుకొడుకైండు. ముందు ముందు సంసారం మంచి చెడ్డలన్నీ వానియే గదా!"

రాజారాం అయోమయం. నువ్వేమంటావన్నట్టుగా చూపులు శోభారాణి మీద వాలినై.

"మావయ్యా!" భయం, వినయం, ధైర్యం కలెగలిపి శోభారాణి గొంతులో వణుకుతున్నై. "అప్పులు తీర్చేతందుకు అప్పులు, వాటి మిత్తీలు ఎన్నేండ్లైనా తీరవు. అప్పుడు ఇంటిమీదికి దాడి వస్తుంది. భూమితోపాటు ఇల్లుగూడా పోతుంది. మీరే ఆలోచించుండ్రి అత్తమ్మా..." దృష్టి అత్తమీదుంది.

హమ్మో... కోడలు అమాయకురాలనుకున్నా... అన్నపూర్ణ ఆశ్చర్యపోయింది. "ఆపరేషన్లే నెలగూడా కాలేదు. గీపరేషన్ నీకెందుకు బిడ్డా! నువు పో... పడుకో పో..." ఆప్యాయంగా ఆదేశించింది. గోడ ఆసరాతో లేచి శోభారాణి గదిలోకెళ్తూ రాజారాం కళ్లల్లోకి చూసింది. అంతకు ముందోసారి అనుకున్న "పల్లెటూర్లె ఏముంది? పట్నంల ఇల్లు గట్టుకుందాం" మాటల్ని గుర్తుజేశాయా చూపులు.

నారాయణలో ఆవేదన. "ఆ భూమిని మా తాతలప్పటినుండి మా చెమటతోని తడిపినమురా. ఇప్పుడు అమ్ముకుంటే ఎట్లుంటదిరా?"

"చెమటతోని తడిపెతందుకు నువు తయారుగున్నా పంటలిచ్చేందుకు భూమి తయారులేదుగదా." రాజారాం దృఢ నిర్ణయం ధైర్యాన్నిచ్చింది. "ప్రతి సంవత్సరం చినుకు చిటుక్కుమనంగనే కూలిచ్చి ట్రాక్టరుతో దున్నించుడాయె. ఇంకోసారి భూమి తడుపు వానవడంగనే ఇత్తనాలేసుడాయె. అటెన్న పెద్దవానలకోసం కండ్లల్ల వత్తులేస్కుని ఎదిరి చూసుడు. వానలు రావు, పంటలు పండవు. విత్తనాలు భూమిల, మనము మనింట్ల చేసిన కష్టం బూడిదల పోసిన పన్నీరాయె."

కొడుకు నోట అంత పెద్ద మాటలొస్తాయని తల్లిదండ్రులెప్పుడూ ఊహించలేదు. కనుబొమ్మలు పీటముడి లేసుకున్నై. దిమ్మ దిరిగినట్టు మొహాలు చూసుకున్నారు.

ముప్పయ్యేళ్ల క్రితం కొత్త కోడలుగా ఆ ఇంట్లో అడుగు పెట్టిన దృశ్యం అన్నపూర్ణ ఎదలో కదలాడింది...


... ఇప్పుడు రేకులు షెడ్డున్నచోట పెద్ద వేప చెట్టు ఉండేది విస్తరించిన కొమ్మలు, రెమ్మలు... వాటి నీడలో నాగలి కర్రలు, గొడ్డండ్లు, కొడవళ్లు, గడ్డపారలు... తొలకరి చినుకులు పడగానే జాతరలాగుండేది. పొద్దంతా కొలిమి మంటలు, సుత్తి దెబ్బలు... నలుగురితో నారాయణ ముచ్చట్లాడుతూ చెమటల్ని తుండుగుడ్డతో అద్దుకునేవాడు. అలసటను సంతోషం మింగేసేది. తండ్రి వ్యవసాయం పనులు చూస్తుండేవాడు. పంట కోతల సీజన్లో రైతులు బిచ్చంగా కొలిచిన ధాన్యం మూటల్ని తండ్రీ కొడుకులు మోసుకొచ్చి గరిసెలు నింపేవారు. ఇంట్లో ధాన్యలక్ష్మి కళకళలాడ్తుండేది.

(మిగతా 12వ పేజీలో)

# వరాహ మమకారం

ఫొటోలో కనిపిస్తున్న 70 కిలోగ్రాముల ఈ పెంపుడు పంది (అమెరికాలోని లాస్‌వేగాస్‌లో) 7 సంవత్సరాల "జోర్డాన్ జోన్స్" అనే చిన్న బాలుడిపై దాడి చేస్తున్న 'బుల్ డాగ్' అనే కుక్క (ప్రక్కింటి నుండి తప్పించుకొని వచ్చింది) బారినుండి కాపాడింది. జోర్డాన్ వాళ్ళు పెంచుకొనే 'డెసీ' అనే ఈ పంది తన యజమాని వాళ్ళబ్బాయిపై దాడిచేస్తున్న ఆ కుక్కపై దాడి చేసింది. ఫలితంగా ఆ కుక్క ఆ అబ్బాయిని విడిచిపెట్టి ఈ పంది తలని కొరికి పట్టింది. ఈలోగా జోర్డాన్ తల్లి చూసి తన కొడుకుని లాగి ఎత్తుకొని పోయి భర్తతో ఈ విషయం చెప్పడంతో తమ పెంపుడు పందిని కాపాడుకోవడానికి, జోర్డాన్ తండ్రి తన పిస్టల్ తీసుకొని, 'బుల్‌డాగ్' యజమాని అనుమతి తీసుకొని కాల్చివేయ్యటంతో ఆ కుక్క వెంటనే చనిపోయింది. పిల్లవాణ్ణి కాపాడటంలో ఆ కుక్కతో పోరాడిన ఈ పంది బాగా గాయపడింది.

- రత్నకుమార్





# చిలుక సాహసం

అమెరికాలో హెయిర్‌డ్రెసర్‌గా పనిచేస్తున్న "ఎర్ల్" అనే వ్యక్తి పనిలోకి వెళ్ళిన తర్వాత, 'ఎర్ల్' అపార్ట్‌మెంట్‌లోకి ఒక దోపిడీ దొంగ ప్రవేశించాడు. అది చూసిన ఎర్ల్ పెంపుడు చిలుక (అప్పటికి పంజరంపైన కూర్చొని ఉంది) ఆ దొంగపై వాలి పిచ్చిగా తనకి ఇష్టం వచ్చినట్లు అతని వంటిపై ముక్కుతో బాగా పొడవటంతో ఆ దొంగ ఈ చిలుక గాట్ల దాటికి తట్టుకోలేక పారిపోయాడు. ఎర్ల్ పోలీసులకి కంప్లైంట్ ఇయ్యగానే చిలుక గాట్ల ఆధారంతో దొంగ వెంటనే దొరికిపోయాడు.

- జి.ఆర్

(9వ పేజీ తరువాయి)

సొంత వ్యవసాయం పంటతోడై అందర్నీ మురిపాలలో ముంచెత్తేది. ఆ కాలమేమాయె? ... గతం గుండెల్లో కరిగి కళ్ళల్లో బిందువులుగా మారుతోంది.

"నువ్వేమంటవు పూర్ణా?" నారాయణ గొంతు గోడల కేదో పాకుతున్నట్టుంది.

"నేనేమంటనయ్యా!" నీళ్లులేని బావిలోకి జారిపడ్డట్టుంది. అన్నపూర్ణకు. "అమ్మాలంటే మనసొప్పదు కాని అమ్మకుంటే ఆగమైపోతము."

ఆ మాటలు రాజారాం ఊహలకు ఊతమిచ్చినై. "అవున్నాయినా! రోజురోజుకు... రోజూ వాడుకునే వస్తువులు ధరలతోపాటు అపనమ్మకాలు పెరిగిపోతున్నై. నా జీతం నా ఖర్చులకే సరిపోదు. ఇంగ మీరెట్లా బతకాలె?" కుండ బద్దలు కొట్టేశాడు. "నా బాధంతా మీకోసమే. భూమి అమ్మి అప్పులు తీర్చినంక అటెన్క ఆలోచిద్దాం." లౌక్యంగా ముగించాడు.

ఓహో! కంటికి రెప్పలా కాపాడుకున్న భూమాత... ఛస్తే నా కట్టాన్ని తన కడుపులో దాచుకుంటుంధనుకున్న భూమితల్లి... నాది కాదన్నమాట. ఏం చెయ్యాలి?... నారాయణ ఎద కల్లోల సముద్రమైంది. రాత్రంతా కలత నిద్ర.

★ ★ ★

రోజట్లాగే తెల్లవారింది. పొద్దు నాగుంబాములా ఎగబాకుతోంది. సూర్యకిరణాలు షెడ్డుమీద వింతకాంతులు వెదజల్లుతున్నై. మారుతికారు వచ్చి ఇంటి ముందాగింది. మురళీధర్ సేటు, పక్కన యాదగిరి ఏదో మాట్లాడుకుంటూ లోపలికొస్తున్నారు. నారాయణ కడుపులో డప్పులు మోగినై.

"రాండ్రి... కూచోండ్రి!" బలవంతపు చిరునవ్వు కర్రకుర్చీలు చూపించింది. రాజారాం చాయ గ్లాసులందించాడు.

మంతనాలు ప్రారంభమైనై. చర్చలు చాలాసేపు సాగినై. తమ ప్రాణాలకే ఖరీదు కడుతున్నట్టనిపించింది నారాయణ దంపతులకు.

"నేనింతకుముందే కొన్న భూమికి నీ భూమి కలిపితే పెద్ద కోళ్లఫారం వెయ్యొచ్చునని గింత ధర వెడ్తున్ననబ్బా!" మురళీధర్ సేటు మాటలు పాలకోవా పేడాల్లాగున్నై. "నీ భూమి, నీ ఇష్టం. ఏదో ఒకటి చెప్పెయ్ నారాయణా. ఇటున్న నీ భూమి కాకపోతే అటున్న అవుసుల బ్రహ్మం భూమి కొంటా". ధీమా వ్యక్తమైంది. ఆ ధీమా యాదగిరిని కదిలించింది.

"చెప్పవోయ్! పక్క భూమికంటే నీ భూమికి రెట్టింపు ధర వస్తుంది నారాయణా, ఈ ధర మల్లా రమ్మంటె రాదు. నువు సరేనంటే ఇప్పుడే బయానా...!"

నారాయణ బేల చూపులు కొడుకు మీదున్నై. తన మీద రాజారాం కోపంగా ఉన్నాడని అర్థమైపోయింది.

"ఇంగ పోవాల్నా నారాయణా!" తలపాగా సర్దుకుంటూ లేచినుంచున్నాడు మురళీధర్ సేటు.

అడవిలో దారిదప్పిన ఊరకుక్కలా ఉరుకులాడ్తున్న నారాయణ మనసును తెచ్చి పెట్టుకున్న నిబ్బరం స్తిమిత పరిచింది.

"కూచోండ్రి సేటూ. మీరన్న ధరకే నా భూమిని మీకమ్ముతా, కాని నాదో కోరిక సేటూ!" చేతులు జోడించాడు.

"అదేదో అడిగెయ్యవోయ్. సేటును నేను ఒప్పిస్తా" నారాయణ ముఖము మబ్బువదిలిన ఎండలా మెరిసింది.

"ఆ భూమిల కోళ్లఫారం ఏసినంక దాంట్ల నేను పంజేస్తా. నాకు గుమాస్తా నౌకరియ్యాలె." స్వాభిమానం దీనంగా అడిగింది.

"ఓ... దాందేముంది నారాయణా! ఇస్తా" భరోసా ఇస్తూ కూచున్నాడు సేటు. చేతిలోని బ్యాగు నోరు తెరుచుకుంది". ఇగో యాద్గిరీ! ఈ బయానా నారాయణకివ్వు" రెండువందల రూపాయల కట్టలు యాదగిరి ద్వారా నారాయణ చేతిలో వాలాయి.

... నా భూమిల నేను కావలి కుక్కోలె తిరుగొచ్చు. కొడుకుమీద ఆధారపడలేను... అంతరాళాల్లో నిక్షిప్తమైన మనోభావన నదిమిపెట్టి నోట్ల కట్టలను కళ్లకద్దుకున్నాడు.

కండువా సర్దుకుంటూ యాదగిరి.... తృప్తిగా నవ్వుకుంటూ ఊపిరి పీల్చుకున్నాడు. ★